క్లుప్తంగా

స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



పాఠశాలల యాజమాన్యాలు, టీచర్లతో మాట్లాడుతున్న వెల్దుర్తి సీఐ యుగంధర్

వెల్దుర్తి: ఈనెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసే బస్సులను నిబంధనల మేరకు నడపాలని సీఐ యుగంధర్ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ.. మోటారు వాహనాల చట్టం ప్రకారం విద్యాసంస్థల బస్సులకు పాటించాల్సిన నిబంధనల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల రక్షణ నిమిత్తం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. యాజమాన్యం, పేరెంట్స్ కమిటీ సమన్వయంతో టీచర్, పేరెంట్‌లు విద్యార్థుల ప్రయాణ సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు విద్యాసంస్థల కరెస్పాండెంట్‌లు, టీచర్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, పీజీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్ పూర్తిచేసిన 18–35 ఏళ్లలోపు యువత అర్హులని తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విత్తన ఎంపిక కీలకం

ఆలూరు: రైతులు నేల స్వభావాన్ని బట్టి విత్తనాన్ని ఎంపిక చేసుకోవాలని ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీత సూచించారు. ఆమె శనివారం మాట్లాడుతూ.. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల పరిధిలో గత మార్చి, ఏప్రిల్‌లో భూసార పరీక్షలను చేయించుకున్న రైతులకు వాటి ఫలితాల ఆధారంగా భూమిలో వాడాల్సిన ఎరువుల మోతాదు తదితర వాటిపై సూచనలు చేశామన్నారు. నేల స్వభావానికి అనుగుణంగా రైతులు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఎంపీఈఓలు, ఏఓలు ప్రత్యేకంగా నిఘా పెట్టాలని ఆదేశించారు. సబ్‌డివిజన్‌లో దాదాపు 35 వేల ఎకరాలలో రైతులు పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కంది, ఆముదం పెసర, జొన్న, సజ్జ పంటలను సాగు చేయనున్నట్లు వెల్లడించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఎన్నిక

తుగ్గలి: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్లుగా రామకొండ వెంకటేశ్వర్లు, బురుజుల పులికొండ, జిల్లా ఇన్‌చార్జ్‌గా రవికుమార్ నియమితులైనట్లు శనివారం ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం డోన్‌లో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య హాజరై తమను ఎనుకున్నట్లు వివరించారు. ఎమ్మార్పీఎస్ స్థాపించి 29 సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో వచ్చే నెలలో విజయవాడలో జన జాగృతి సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దికెర: మద్దికెర టౌన్‌లో సెకండ్ ఫీడర్ నవీకరణ పనులు జరుగుతున్న కారణంగా ఆదివారం సాయినగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేశ్వరరెడ్డి తెలిపారు. నంచర్ల ఫీడర్ ద్వారా సరఫరా అవుతున్న త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు ఉంటాయన్నారు. ఉదయం 4 గంటలకు ఇవ్వాల్సిన విద్యుత్ 9 గంటల నుంచి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ మల్లికార్జున

చిప్పగిరి: మండలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఏరూరు గ్రామానికి చెందిన దేగులపాడు గోపాల్‌ను అరెస్ట్ చేసి 127 హైవార్డ్ విస్కీ (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాష తదితరులు పాల్గొన్నారు.

జూన్ ఫీవర్..నో ఫికర్!

- బడులకు చేరిన జగనన్న విద్యాకానుకలు
- విద్యను పేద విద్యార్థులకు వరంగా మార్చిన ప్రభుత్వం
- నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలు



పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

ఎమ్మిగనూరు: జూన్ మాసం మొదలైందంటే చాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక సర్దుబాట్లు కలవరపెట్టేవి. పిల్లల స్కూల్ ఫీజు.. ఏకరూప దుస్తులు, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు తదితర వాటి కోసం ఆందోళనలు పడేవారు. కానీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిననాటి నుంచి పేదవిద్యార్థుల చదువుల బాధ్యతలను కూడా ప్రభుత్వమే తీసుకుంది. నాడు–నేడు పనులతో బడులను తీర్చిదిద్ది, విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు అందించి, వారి తల్లులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనల పేరుతో ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తోంది. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యాకానుకలను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే మౌలిక వసతులతో పాటు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, దుస్తులు, బూట్లు తదితర వాటితో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు చేర్చింది.

ప్రభుత్వ బడులు కార్పొరేట్ విద్యావస్థను తలదన్నేలా మారాయి. చంద్రబాబు పాలనలో కార్పొరేట్ విద్యవైపు చూసే తల్లిదండ్రులు నేడు ప్రభుత్వ బడుల్లో తమ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. గత మూడేళ్లగా ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు, వస్తున్న ఫలితాలు అందుకు నిదర్శనంగా మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగ ప్రగతికి బాటలు వేస్తున్నారు. నాడు–నేడుతో కోట్లరూపాయలు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చుతున్నారు. విద్యార్థులకు విద్యాకానుకల కింద స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు అందిస్తున్నారు. పాఠశాలలకు వచ్చే పేద విద్యార్థులకు పోషక చిక్కీలు, గుడ్లు తదితర బలవర్థక ఆహారం మధ్యాహ్న భోజనంలో అందిస్తున్నారు. ఉపాధ్యాయుల్లో కూడా బాధ్యత పెంచేందుకు ఫేస్‌మ్యాపింగ్ తీసుకొచ్చారు. దీంతో విద్యార్థుల్లోనూ పాఠశాలలంటే ఆసక్తి పెరిగింది. వారిని మరింత ప్రోత్రహించేందుకు పాఠశాల పునఃప్రారంభం రోజే (ఈ నెల 12న) ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్స్‌లు, బెల్టు, స్కూల్ బ్యాగ్‌తో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఉమ్మడి ఆదోని రెవెన్యూ డివిజన్‌లో విద్యార్థులకు అందించే విద్యా కానుక వివరాలు..

విద్యాకానుక రకం	క్వాంటిటీ
యూనిఫాం	2,92,957
నోట్ పుస్తకాలు	15,69,002
పాఠ్య పుస్తకాలు	33,17,404
షూ	2,91,821
డిక్షనరీలు (ఆక్స్‌ఫర్డ్)	31,072
డిక్షనరీలు (పిక్టోరియల్)	25,187
స్కూల్‌బ్యాగ్‌లు	2,92,957
బెల్టులు	2,16,425



పంపిణీకీ సిద్ధంగా స్కూల్ బ్యాగ్‌లు

పిల్లల గురించి భయంలేదు



పిల్లలను చదివించాలంటే భయపడే రోజులు పోయాయి. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండగా ఏ తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన అవసరమేలేదు. విద్యా సామగ్రి ఠంచన్‌గా అందుతోంది. అమ్మ ఒడి ఇస్తున్నారు. పిల్లలకు పోషక ఆహారం ఇస్తున్నారు. బడుల్లో సౌకర్యాలు పెంచారు. టీచర్ల రెగ్యులర్‌గా వచ్చేలా చేశారు. ఇంక పిల్లల చదువుల పట్ల మాకు ఎలాంటి భయం లేదు.

– కే రాధమ్మ, జొహరాపురం

మొదటి రోజే విద్యా కానుక



పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12న విద్యార్థులందరికీ విద్యాకానుకలు అందేలా ఏర్పాట్లు చేశాం. మండలాల నుంచి ఆయా పాఠశాలలకు విద్యాకానుక కిట్లను చేర్చాం. ప్రభుత్వ పాఠశాల్లో విద్యాసౌకర్యాలు పెరగటం, అందుకు అనుగుణంగా ఫలితాలు రావటం ఆనందంగా ఉంది. ఇది పేద, మధ్యతరగతి వర్గాలకు శుభపరిణామం.

– యూజీ సుకుమార్, డిప్యూటీ డీఈఓ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తుగ్గలి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమలింగేశ్వ స్వామి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా శనివారం నునసరాల్లలో నిర్వహించిన వృషభాల బండలాగుడు పోటీలను ఆమె ప్రారంభించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. పోటీలలో గెలుపొందిన వృషభ యజమానులకు దాతలు రంగారెడ్డి, బ్రహ్మానంద, పెద్ద రంగారెడ్డి, పరుశురాంరెడ్డి, రమణారెడ్డి, రవికుమార్‌రెడ్డి, పీసీ రంగారెడ్డి వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా వైఎస్సార్ బీమా నమోదు

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోందని హొళగుంద పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఆయన శనివారం వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బీమా నమోదు గడువు శనివారం ముగుస్తున్నందున వలంటీర్లతో కలిసి పాత వాటి రెన్యూవల్ అప్‌డేట్, కొత్తగా నమోదు చేసే పనిని వేగవంతం చేసినట్లు తెలిపారు. వలంటీర్లు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని, సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలకు సంబంధించి, ఇతర సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ బీమా రెన్యూవల్ సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. ఆయన శనివారం మాట్లాడుతూ.. మండలంలో 9 సచివాలయాల పరిధిలో 11,166 మందికిగాను 7,754 మంది చేత రెన్యూవల్ చేసి ఇప్పటివరకు 75 శాతం పూర్తి చేసినట్లు వివరించారు.

రూ. 96 లక్షల విత్తన విక్రయాల నిలిపివేత



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ మహేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల్లో శనివారం మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రూ.96.31 లక్షల విలువచేసే పత్తి, మిరప విత్తనాలను సీజ్ చేసి, విక్రయాలను నిలిపివేయాలని దుకాణదారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్, శ్రీ పంచముఖి ట్రేడర్స్, శ్రీ భీమలింగేశ్వర ఏజెన్సీ, రవితేజ సీడ్స్ విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేసినట్లు చెప్పారు. విత్తన విక్రయ చట్టం ప్రకారం రికార్డులు, స్టాక్ వంటివి పరిశీలించి ఈ నాలుగు దుకాణాల్లో రూ.96,31,185 విలువచేసే మిరప, పత్తి విత్తనాల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు. వీటికి సంబంధించి తగిన సర్టిఫికెట్లు, రికార్డులు చూయిస్తే విక్రయాలకు అనుమతిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేసినా, అధిక ధరలకు విక్రయించినా దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు బిల్లు తీసుకోవాలని, పంట దిగుబడులు వచ్చే వరకు బిల్లును జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. పంట సాగులో ఏదైనా సమస్య వస్తే బిల్లు ఆధారంగా ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికుల కృషితోనే సంస్థ అభివృద్ధి



ప్రశంసా పత్రాలను అందిస్తున్న జిల్లా చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.రమణ

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని జిల్లా ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.రమణ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో అత్యుత్తమ సేవలందించి ఆయిల్ పొదుపు చేసిన డ్రైవర్లు నటరాజు, కేఎస్ వాసు, కండెక్టర్లు ఐజమ్మ, గోపాల్, సూపర్‌వైజర్ గంగన్న, మెకానిక్‌లు సీఎస్ బాబు, ఉమాశంకర్‌లకు ప్రోత్సాహక నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను డీఎం నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్ జీవి.నాగరాజుతో కలిసి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. డిపో సూపరింటెండెంట్ మెకానిక్ ఆంజనేయులు, పంపయ్య, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎంఎస్ వాసు, నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి ముస్తక్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కోగిలతోటలో వాడుతున్న పంటలు



వాడుతున్న మొక్కజొన్న పైరు

హొళగుంద: గత కొద్ది రోజులుగా కోగిలతోటలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయంతో పంటలు వాడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇటీవల ఈదురుగాలుల తీవ్రతకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, వాటిని బాగు చేసి విద్యుత్ పునరుద్ధరించినా వ్యవసాయానికి మాత్రం సక్రమంగా సరఫరా చేయడం లేదన్నారు. దీంతో బోర్ల కింద సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, మిరప తదితర పంటలకు నీటి తడులు అందక వాడుముఖం పట్టి కళ్లెదుటే వాడిపోతుంటే జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో దేవతామూర్తుల ప్రతిష్ఠ



బొమ్మిరెడ్డిపల్లెలో ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొన్న పలు ఆలయాల పీఠాధిపతులు



నునుసరాల్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: మండలంలోని బోయనపల్లె రాముల ఆలయంలో హనుమత్ ధ్వజ ప్రతిష్ఠ, గ్రామ బస్టాప్ సమీపాన గల రాధాస్వామి, ఆదోని లక్ష్మమ్మ అవ్వల గుడిలో నూతన విగ్రహాలతోపాటు గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవతా మూర్తులు, అశ్వర్థ నారాయణ స్వామి వారి కల్యాణం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది భక్తులు పాల్గొని ప్రతిష్ఠానంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైవే–44ను ఆనుకుని ఉన్న బొమ్మిరెడ్డిపల్లె అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సరస్వతి, నాగుల తల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూర్తుల ప్రతిష్ఠ చేపట్టారు. పలు ఆలయాల పీఠాధిపతులు, సేవా సంస్థాన్‌లు ఎల్లప్ప స్వామి, మేడా సుబ్రహ్మణ్యం, దాసరి రామచంద్ర, బజారి, చిన్న రామాంజనేయులు, శ్రీరాములు, గిడ్డయ్య నాయుడు పాల్గొన్నారు.

తుగ్గలి: నునుసరాల్లలో నూతనంగా నిర్మించిన సోమలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను దాతలు, ఆలయ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం కనుల పండువగా నిర్వహించారు. రుత్వికుల వేద మంత్రోచ్చరణల మధ్య హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీస్వామి గణపతి, నంది, ధ్వజ, శిఖర, నాభి శిల, నాగదేవత, అన్నపూర్ణ, సోమలింగేశ్వర స్వామి ప్రతిష్ఠ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని తిలకించారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, లక్ష్మిరెడ్డి, ఎస్.రామచంద్రారెడ్డి, వివిధ పార్టీల నాయకులు హాజరై స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు పురుషోత్తంరెడ్డి, మధుకేశవరెడ్డి, సర్పంచ్ రామలక్ష్మమ్మ, దాతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు మద్దికెరకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: మండలంలో సోమవారం సాయంత్రం 3:30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక సాయినగర్‌లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

1,490 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

కృష్ణగిరి: మండలంలోని ఆర్‌బీకేల ద్వారా ఇప్పటి వరకు 1,490 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే వెంటనే అందిస్తామన్నారు. విత్తనాలు తీసుకున్న వారు అదే పంట సాగు చేయాలని, విత్తనాలను దళారులకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చాలా గ్రామాల్లో పంటల సాగు పనులు ప్రారంభించారని, విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. పత్తి, ఆముదం విత్తనాలను తీసుకునే రైతులు రసీదు తప్పక తీసుకోవాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. శనివారం ఉదయం ఆయన పోలీస్ స్టేషన్ బోర్డు వద్ద ఎమ్మిగనూరు, కర్నూలు రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 25 మందికి రూ.2500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు. పెండింగ్ చలానాలు చెల్లించకుండా రోడ్డుపై వాహనంతో పట్టబడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసులు పాల్గొన్నారు.

మెరుపు ధాటికి అస్వస్థత

తుగ్గలి: మెరుపు ధాటికి ఓ వ్యక్తి షాక్‌కు గురయ్యాడు. చెన్నంపల్లికి చెందిన మల్లేష్ శనివారం రాత్రి గాజుల షాపులో ఉన్న సమయంలో ఉరుములు, మెరుపులు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో ఇనుప చువ్వకు తగలడంతో మల్లేష్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వైద్యుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు బాధితుడిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని బంటణాహాలు గ్రామ రైల్వేస్టేషన్ నుంచి ఏరూరు గ్రామం వరకు 10 కి.మీ మేర రూ.20 లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు మార్గం పూర్తిగా దెబ్బతినడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రంగస్వామి, శ్రీధర్, రాజన్న, బాలకృష్ణ, శేకన్న, సూరి తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో వర్షం

గోనెగండ్ల: మండలంలో శుక్రవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. 20.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత నెలలో కురిసిన వర్షానికి కొంత మంది రైతులు తమ పొలాల్లో పంటలను సాగు చేసుకున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఆ పంటలకు ప్రాణం పోసినట్లు అయ్యిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాత్రి వర్షం కురవడంతో శనివారం ఉదయం నుంచే రైతులు తమ పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

పొంచిఉన్న వరద ముప్పు



హొళగుంద కుమ్మరి వీధిలో చేరిన వర్షపునీరు (ఫైల్)

హొళగుంద: స్థానిక కుమ్మరి వీధి బురదమయం కావడంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుమ్మర వీధిలోకి భారీగా వరద చేరి వంకను తలపించింది. కాలనీ పక్కనే ఉన్న కొర్చెవంకలో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడం, రోజురోజుకు ఆక్రమణలు పెరగిపోవడంతో వీధితో పాటు 5వ వార్డుకు ప్రమాద ముప్పు పొంచి ఉంది. వంక ఆక్రమణ కారణంగా వర్షపు నీరు ముందుకెళ్లకపోవడం ఒక ఎత్తైతే, ప్రమాదవశాత్తు చిన్న పిల్లలు వంకలో పడితే ఇక దొరకని పరిస్థితిలో ఆక్రమణ జరిగింది. కొర్చెవంక ఆక్రమణ, పూడిక వల్ల మురుగు నీరు ముందుకెళ్లకుండా చెత్త చెదారం, పూడిక చేరి దుర్వాసన, దోమల బెడద తీవ్రంగా మారి పరిసర కాలనీవాసులు అనారోగ్యం పాలౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంకలో ఆక్రమణలు తొలగించి మురుగు, వర్షపు నీరు ముందకెళ్లేలా పూడికను తొలగించాలని పరిసర కాలనీ వాసులు కోరుతున్నారు.

విత్తనాలకు సోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరి

గోనెగండ్ల: షాపులో ఉన్న ప్రతి విత్తనానికి సోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి డీలర్లకు సూచించారు. ఆయన శనివారం మాట్లాడుతూ.. విత్తనానికి సంబంధించి ఒక సోర్స్ సర్టిఫికెట్ ఒక షాపుకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సర్టిఫికెట్ గడువు తేదీ, లైసెన్స్ గడువు తేదీ చూసుకోవాలన్నారు. గడువు ముగిసిన లైసెన్స్‌దారులు విత్తన వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పత్తి, మిరప, ఇతర విత్తనాలను ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే రైతులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే ప్రతిరోజు ధరల పట్టిక, విత్తన నిల్వలను బోర్డు మీద ప్రదర్శించాలని దుకాణదారులకు సూచించారు. డీలర్లందరూ విత్తన నియంత్రణ చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం క్రయవిక్రయాలు జరుపుకోవాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి డీలర్ క్రయవిక్రయాల వివరాలను ప్రతి నెలా 5వ తేదీలోపు ఏఓ, ఏడీఏ, జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించాలని ఆదేశించారు.

ఉత్సాహంగా పంటలసాగు

కృష్ణగిరి: మండలవ్యాప్తంగా అన్నదాతలు ఏరువాక సాగులో నిమగ్నమయ్యారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి శనివారం చాలా గ్రామాల్లో అన్నదాతలు కంది, పత్తి, ఆముదం పంటలతోపాటు అక్కడక్కడ వేరుశనగ విత్తనం వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మృగశిర కార్తె రాగానే ముందస్తుగా వర్షం రావడంతో అదునులోగా విత్తనాలు వేసుకునేందుకు అన్నదాతలు ఎద్దులతోపాటు, ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. గత ఐదేళ్లగా ఇలా ముందస్తు విత్తు వేయలేదని ఈయేడాది ముందస్తు వర్షాలతో దేవుడిపై భారం వేసి సాగు చేపట్టామని రైతులు పేర్కొన్నారు.

ముగిసిన ప్రవచనాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక ప్రవచనాలు శనివారం ముగిశాయి. జిల్లా కన్వీనర్ మల్లువెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పండితుడు రాజా జయచంద్రన్ హిందూ ధర్మం, భారతీయ సంస్కృతి, ఔన్నత్యం గురించి ప్రవచనాల ద్వారా వినిపించారు. భజన మండలి ఆలపించిన గీతాలు భక్తులను అలరించాయి. గ్రామ సర్పంచు హరిత, నాయకుడు సాంబశివారెడ్డి, భక్త భజన బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ



పూజలందుకుంటున్న పెద్దమ్మ తల్లి

పత్తికొండ రూరల్: స్థానిక కుమ్మరి వీధిలోని పెద్దమ్మవ్వ దేవాలయంలో శనివారం కలశ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ముందుగా పెద్దమ్మ తల్లికి అర్చకులు శ్రీకాంత్‌ఆచారి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అనంతరం కలశ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సేవాదళ్ అధ్యక్షుడు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

పాడు బంగ్లా కాదు.. డీఈ కార్యాలయం



ఆలూరులోని ఎగువ కాలువ డీఈ కార్యాలయం

ఆలూరు: తుంగభద్ర బోర్డు పరిధిలోని ఆలూరు సబ్ బ్రాంచ్ ఎగువ కాలువ, 3వ సబ్ డివిజన్ కార్యాలయాన్ని 2008లో అప్పటి ప్రభుత్వం ఆయకట్టు రైతులు, టీసీ మెంబర్లకు అనుకూలంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి ఆలూరులోని ఎంపీడీఓ క్వార్టర్స్‌కు మార్చింది. దీంతో ఎగువ కాలువ ఆయకట్టు రైతులకు డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు, తదితరులు అందుబాటులో ఉంటూ సాగు నీరు, ఆధునికీకరణ తదితర వివరాలు తెలియజేస్తారని మొదట్లో అందరూ భావించారు. అయితే ఇక్కడ పనిచేసే డీఈ, జేఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లస్కర్లు, సంబంధిత ఇంజినీర్లు కార్యాలయానికి రాకపోకలు తగ్గించడంతో భవనం పాడుబడ్డ బంగ్లాగా మారిపోయింది. క్రమంగా కార్యాలయం మూత పడడంతో చిన్నారులకు ఆటస్థలంగా, పెద్దలకు పేకాట క్లబ్‌గా మారిందని పలువులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంకు రెండో తలుపునకు మాత్రమే తాళాలు వేశారు. అసలు ఇక్కడ ఎగువ కాలువ కార్యాలయం ఉన్నట్లా? లేనట్లా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎగువ కాలువ డీఈ మంజూనాథ్‌ను విచారించగా 3వ సబ్ డివిజన్ కార్యాలయం ఆలూరులోనే ఉందని అయితే అధికారులు గుంతకల్లు బ్రాంచ్ కార్యాలయంలో ఉంటున్నారని చెప్పారు.

సేవాదళ్ వార్షికోత్సవం

పత్తికొండ రూరల్: పేద ప్రజల సంక్షేమమే సేవాదళ్ లక్ష్యమని వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆ సంస్థ స్థానిక కార్యాలయంలో సేవాదళ్ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించి సభ్యులకు కానుకలను అందజేశారు. మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు టైలరింగ్ శిక్షణ, వాటర్ ప్లాంట్ల ఏర్పాటు, నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, వైకుంఠ రథం తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సభ్యులు కోటేశ్వరరావు, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.